ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడాలి

- ఎస్పీ చెన్నూరి రూపేష్‌
- జిన్నారం పోలీస్‌ స్టేషన్‌ ఆకస్మిక తనిఖీ

జిన్నారం (పటాన్‌చెరు): పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారులతో మర్యాదగా మాట్లాడాలని ఎస్పీ చెన్నూరు రూపేష్‌ ఆదేశించారు. మంగళవారం జిన్నారం మండల కేంద్రంలోని పోలీస్‌ స్టేషన్ను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్‌ పరిసరాలతో పాటు, కనీస వసతులను పరిశీలించారు. రికార్డులను పరిశీలించి రోజువారి పిటిషన్లను ఆన్‌లైన్లో నమోదు చేయాలని చెప్పారు. అండర్‌ ఇన్వెస్టిగేషన్‌ కేసులలో దర్యాప్తును వేగవంతంగా చేయాలన్నారు. ఆన్‌లైన్‌ మోసాలు, రోడ్డు ప్రమాదాలు భూ సంబంధిత చీటింగ్‌ వ్యవహారాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ప్రతిరోజు వాహన తనిఖీలు నిర్వహించాలని చెప్పారు. అక్రమ రవాణా పనులను నిరోధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నేరాల్లో త్వరితగతిన విచారణ పూర్తి చేయాలన్నారు. సీసీ కెమెరాల ప్రాధాన్యతను వివరించి ప్రజలు స్వచ్ఛందంగా ఏర్పాటు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఆయన వెంట సీఐ సుధీర్‌ కుమార్‌ ఎస్‌ఐ నాగలక్ష్మి పాల్గొన్నారు.

ట్రైనీ పోలీసులు పరీక్షలకు సిద్ధం కావాలి

సంగారెడ్డి జోన్‌: శిక్షణలో తొమ్మిది నెలల బేసిక్‌ శిక్షణ పూర్తి కావటంతో ఫైనల్‌లో నిర్వహించే ఇండోర్‌, అవుట్‌ డోర్‌ పరీక్షలకు సిద్ధం కావాలని ఎస్పీ రూపేష్‌ అన్నారు. మంగళవారం జిల్లా పోలీస్‌ శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు ఉద్యోగం ఎన్నో సవాళ్లతో కూడుకుని ఉంటుందని, శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉన్నప్పుడే ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కోవచ్చని చెప్పారు. ఎస్పీ వెంట డీటీసీ ప్రిన్సిపాల్‌, జిల్లా అడిషనల్‌ ఎస్పీ సంజీవరావు, వైస్‌ ప్రిన్సిపాల్‌, డీఎస్పీ రమేష్‌, ఆర్‌ఐ శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

నానక్‌రాంగూడకు నయా లుక్‌..!

నాడు మురికికూపం చోటే నేడు మినీ పార్కులు

- ఓఆర్‌ఆర్‌ నానక్‌రాంగూడ అండర్‌బ్రిడ్జి వద్ద నిర్మాణాలు
- మరింత అభివృద్ధి చేస్తే స్థానికులకు ఎంతో మేలు



ఖాజాగూడ వైపు ప్రారంభ దశలో పార్కు



నానక్‌రాంగూడ ఓఆర్‌ఆర్‌ అండర్‌బ్రిడ్జి వద్ద పార్కు

రాయదుర్గం: ఒకప్పుడు పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం, వ్యర్థాల డంపింగ్‌తో మురికి కూపంగా మారిన చోటే మినీ పార్కులు ఏర్పాటు చేయగా కొత్తందాలు సంతరించుకున్నాయి. నానక్‌రాంగూడలోని ఔటర్‌రింగురోడ్డు అండర్‌ బ్రిడ్జి వద్ద మూడు మినీ పార్కులను హైదరాబాద్‌ గ్రోత్‌ కారిడార్‌ పర్యవేక్షణలో ఏర్పాటు చేశారు. ఇందులో వాకింగ్‌ చేసేందుకు ట్రాక్‌లు, గ్రీనరీ కోసం పూల మొక్కలు, ఇతర ఆకట్టుకునే మొక్కలు నాటారు. చుట్టూ ప్రహరీలు, గేట్లు కూడా ఏర్పాటు చేశారు. చాలామంది ఉదయం, సాయంత్రం సేద తీరేందుకు వస్తున్నారు. అయినప్పటికీ వీటి అభివృద్ధిపై మరింత శ్రద్ధ వహించాలని స్థానికులు కోరుతున్నారు.

స్థానికుల డిమాండ్లు..

- ఈ పార్కుల ముందున్న రోడ్డుపై వాహనాల వేగాన్ని నియంత్రించాల్సిన అవసరం ఉంది. చిన్నారులు, వృద్ధులు, మహిళలు పార్కులో పలికి వెళ్లేముందు, బయటకు వచ్చే సమయంలో రోడ్డుదాటే సమయంలో ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలి.
- నానక్‌రాంగూడ పరిసరాల్లో ఎక్కడా పార్కులు లేకపోవడం, అభివృద్ధి చేసేందుకు అవసరమైన స్థలం కూడా లేకపోయిన తరుణంలో అండర్‌బ్రిడ్జి వద్ద మూడు మినీ పార్కులు ఏర్పాటు చేయడం ఆనందంగా స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.
- అయితే ఈ మినీ పార్కులను మరింత అభివృద్ధి చేయడంపై అధికారులు సరైనా శ్రద్ధ చూపడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి మరిన్ని వసతులు కల్పించాలని కోరుతున్నారు.
- మూడు మినీ పార్కుల్లో రెండింటిలో వాకింగ్‌ ట్రాక్‌లు ఏర్పాటు చేసినా ఒకదాంట్లోనే అనువుగా ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.
- రెండు మినీ పార్కుల్లో ఓపెన్‌ నాలాలు ఉండడంతో కొంత ఇబ్బందిగా ఉందని వాటి స్థానంలో పైప్‌లైన్లు ఏర్పాటు చేసి దుర్వాసన రాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.
- ఈ పార్కుల్లో చెట్ల నుంచి రాలిన ఆకులను ఎప్పటికప్పుడు తొలగించేలా చూడాలి.
- అక్కడక్కడా కూర్చునేందుకు బెంచీలు సైతం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

చిల్డ్రన్‌ పార్కుగా అభివృద్ధి చేయాలి..

- మూడు మినీ పార్కుల్లో పూర్తి స్థాయి మౌలిక వసతులు కల్పించిన తర్వాత అందులో ఒకదానిని పూర్తిగా చిన్నారులు ఆడుకునేలా ఆట వస్తువులు ఏర్పాటు చేయాలని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు.
- ముఖ్యంగా ఒకేచోట కాకుండా పార్కులను నలుమూలలా ఏర్పాటు చేసి అంతటా చిన్నారులు ఆడుకునేలా చేయాలని స్థానికులు కోరుతున్నారు.



నానక్‌రాంగూడ వైపు ఓఆర్‌ఆర్‌ అండర్‌బ్రిడ్జి పార్కులో ఓపెన్‌ నాలా



ఖాజాగూడ వైపు ఉన్న ఓఆర్‌ఆర్‌ అండర్‌బ్రిడ్జి వద్ద మినీ పార్కులో పరుచుకున్న పచ్చదనం



ఖాజాగూడ ఓఆర్‌ఆర్‌ అండర్‌బ్రిడ్జి వద్ద మినీ పార్కులో ఏర్పాటు చేసిన వాకింగ్‌ ట్రాక్‌

గడ్డపోతారంలో డీఎల్‌పీఓ విచారణ

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం గడ్డపోతారం గ్రామ పంచాయతీలో మంగళవారం డీఎల్పీఓ అనిత విచారణ చేపట్టారు. అనుమతులు లేకుండా ఓ వెంచర్‌ ప్రహరీ గోడ నిర్మించిన విషయంలో పంచాయతీ కార్యదర్శి నరేష్‌ బాబును సస్పెండ్‌ చేసిన విషయం విదితమే. ఈ వ్యవహారంలో డీఎల్‌పీఓ వెంచర్‌ ఏర్పాటు చేసిన స్థలాన్ని పరిశీలించి సమగ్ర విచారణ చేపట్టారు. సేకరించిన వివరాలను జిల్లా ఉన్నతాధికారులకు నివేదిస్తానని డీఎల్‌పీఓ అనిత తెలిపారు.

ఘనంగా ఎస్‌ఆర్‌ శంకరన్‌ జయంతి



నివాళులర్పిస్తున్న ఫ్రెండ్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ నాయకులు

శేరిలింగంపల్లి: ఫ్రెండ్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి భవిత కేంద్రంలో ఎస్‌ఆర్‌ శంకరన్‌ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఫ్రెండ్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ కన్వీనర్‌ తాడిబోయిన రామస్వామియాదవ్‌ మాట్లాడుతూ యువత, యువ అధికారులు ఎస్‌ఆర్‌ శంకరన్‌ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ప్రజలు, సమాజానికి మరింత మెరుగైన సేవలందించాలన్నారు. ఎస్‌ఆర్‌ శంకరన్‌ ఐఏఎస్‌ అధికారిగా అనేక హోదాల్లో పనిచేసి వాటికే వన్నె తెచ్చారని గుర్తు చేశారు. బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల కోసం సాంఘిక సంక్షేమ హాస్టళ్లను తీసుకువచ్చారని, అనంతరం అవే రెసిడెన్షియల్‌ స్కూల్స్‌గా తీర్చిదిద్దినట్లు తెలిపారు. అప్పట్లో ఆయనకు కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్‌ను ప్రతిపాదించినా ఆయన తిరస్కరించారన్నారు. ఈ సందర్భంగా భవిత కేంద్రం విద్యార్థులకు పండ్లు, పుస్తకాలు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ప్రతినిధులు జిల్‌ మల్లేశ్‌, వాణీ సాంబశివరావు, శివరామకృష్ణ, అమ్మయ్య చౌదరి, బాలన్న, ఎంఈవో కార్యాలయ ఉద్యోగులు శ్రీకాంత్‌రెడ్డి, వాణి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌

ఆల్విన్‌కాలనీ: సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ అన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్‌ ఎల్లమ్మబండలోని దత్తాత్రేయ నగర్‌ కాలనీలో రూ.17 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులను సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని సూచించారు. కార్యక్రమంలో శివరాజ్‌ గౌడ్‌, జగదీష్‌, నాగభూషణం, మల్లేష్‌, సంతోష్‌ బిరాదర్‌, నాగేష్‌, వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ రవికుమార్‌, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఇస్నాపూర్‌ వరకు మెట్రో నిర్మాణం చేపట్టాలి



మంత్రి శ్రీధర్‌ బాబుకు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ



జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ ఇలంబర్తితో సమావేశమైన ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

గచ్చిబౌలి: మియాపూర్‌ నుంచి ఇస్నాపూర్‌ వరకు మెట్రో రైలు నిర్మాణం చేపట్టాలని పీఏసీ చైర్మన్‌ ఆరెకపూడి గాంధీ కోరారు. ఈమేరకు అసెంబ్లీ ప్రాంగణంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుతో కలిసి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌ బాబును మంగళవారం కలిసి వినతి పత్రంతో పాటు నాగ్‌పూర్‌ మెట్రో రైలు నమూనాను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్‌ నియంత్రణకు మెట్రో రైలు పొడిగించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుందన్నారు. మియాపూర్‌, ఆల్విన్‌ చౌరస్తా మీదుగా రోజుకు లక్షకు పైగా వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయని నాగ్‌పూర్‌ తరహాలో ఒకే పిల్లర్‌పై మెట్రో రైలు నిర్మాణం చేపట్టి అందుబాటులోకి తీసుకువస్తే ఉపయోగకరంగా ఉంటుందని కోరారు. ఈ విషయమై మంత్రి సానుకూలంగా స్పందించారని గాంధీ తెలిపారు.

నిధులు కేటాయించాలని వినతి..

గచ్చిబౌలి: ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్‌ ఆరెకపూడి గాంధీ జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ ఇలంబర్తితో మంగళవారం సమావేశమయ్యారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపు తదితర అంశాలపై చర్చించారు. పెండింగ్‌ పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని, ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల పునరుద్ధరణ, పలుచోట్ల సిమెంట్‌ రోడ్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. అలాగే చెరువుల సుందరీకరణ, పార్కుల అభివృద్ధి, కొన్ని కాలనీల్లో వీధి దీపాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కమిషనర్‌కు వివరించారు. కమిషనర్‌ సానుకూలంగా స్పందించారని ఆయన పేర్కొన్నారు.

5న చలో ఇందిరాపార్కు

మోతీనగర్‌: కార్పొరేట్‌ సంస్థల రాకతో తమ ఉపాధి దెబ్బతిందని, ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని నాయీ బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు నరసింహ నాయీ అన్నారు. మంగళవారం మూసాపేట డివిజన్‌ మోతీనగర్‌ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం కార్యవర్గ సమావేశం అవంతినగర్‌ తోట కమ్యూనిటీ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ డిమాండ్లతో నవంబర్‌ 5న ఇందిరాపార్కు వద్ద నిర్వహించే ధర్నాలో పెద్ద ఎత్తున పాల్గొనాలని సూచించారు. తమ కుల వృత్తిని ఇతర కులాల వారు చేయకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వెంకటేష్‌, సిరిసిల్ల శ్రీనివాస్‌, ధర్మం, కనకయ్య, బాలకృష్ణ, భాస్కర్‌, వి. గోపి నాయి, దశరథ్‌ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

కేపీహెచ్‌బీకాలనీ: ఆస్క ఎడ్యుకేషన్‌ వెల్ఫేర్‌ సొసైటీ వ్యవస్థాపకులు, జేఎన్‌టీయూహెచ్‌ ప్రొఫెసర్‌ వసుమతి, శివకుమార్‌ ఆధ్వర్యంలో మంగళవారం శివానంద రిహాబిలిటేషన్‌ సెంటర్‌లో అన్నదానం నిర్వహించారు. వారి చిన్న కుమారుడు రోషన్‌ బాబు పుట్టిన రోజు సందర్భంగా అన్నదానం చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు ఎరవెల్లి జగన్‌, భానుప్రకాష్‌, హేమంత్‌, రూప్‌సింగ్‌, దేవి తదితరులు పాల్గొన్నారు.

నేషనల్‌ ట్రైబల్‌ కమిషన్‌ సభ్యుడిని కలిసిన సభ్యులు



నేషనల్‌ ట్రైబల్‌ కమిషన్‌ సభ్యుడు హుస్సేన్‌ నాయక్‌కు వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

రాయదుర్గం: హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్శిటీలోని సేవాలాల్‌ విద్యార్థి దళ్‌ (ఎస్‌ఎల్‌వీజీ) సభ్యులు నేషనల్‌ ట్రైబల్‌ కమిషన్‌ సభ్యుడు హుస్సేన్‌నాయక్‌ను మంగళవారం కలిశారు. హెచ్‌సీయూలో ఎస్టీ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగేళ్లుగా టీఎస్‌ ఈపాస్‌ స్కాలర్‌షిప్‌లు అందడం లేదని, డీఏజీ ఫెల్లోషిప్‌లు పెంచాలని, హెచ్‌సీయూ క్యాంపస్‌లోని ఏదో ఒక భవనానికి సేవాలాల్‌ మహరాజ్‌జీ పేరు పెట్టాలని కోరారు. అలాగే యూనివర్శిటీల్లో ఎస్టీ రిజర్వేషన్లను పకడ్బందీగా అమలయ్యేలా చూడాలని విన్నవించారు. న్యాయం జరిగేలా చూస్తానని హామీనిచ్చినట్లు విద్యార్థులు తెలిపారు.

వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించాలి

- చందానగర్‌ ఉపకమిషనర్‌ మోహన్‌రెడ్డి
- పారిశుద్ధ్య కార్మికులు, రాంకీ ప్రతినిధులతో సమీక్ష



పారిశుద్ధ్య కార్మికులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న డీసీ మోహన్‌రెడ్డి

చందానగర్‌: దీప్తిశ్రీనగర్‌ డంపింగ్‌ యార్డులోని వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించాలని ఉపకమిషనర్‌ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. చందానగర్‌లోని అంబేడ్కర్‌ కల్యాణ మండపంలో పారిశుద్ధ్య కార్మికులు, రాంకీ ప్రతినిధులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ ఆటోలు డంపింగ్‌ యార్డు బయట వ్యర్థాలను వేయకుండా పర్యవేక్షణలో నిర్లక్ష్యం వహించినందుకు రాంకీ సంస్థకు రూ.2 లక్షల జరిమానా విధించామన్నారు. చెత్త కుప్పల వల్ల దుర్వాసన వస్తోందని డంపింగ్‌ యార్డు పరిసర ప్రాంతాలవాసులు పలుమార్లు వినతి పత్రాలు అందజేశారన్నారు. చెత్త ఆటోలు ఇంటి వద్దనే వ్యర్థాలను వేరు చేసి డంపింగ్‌ యార్డులోనే వేయాలని సూచించారు. యార్డులో సీఎస్‌ఆర్‌ కింద పారిశుద్ధ్య కార్మికులకు కనీస వసతులు కల్పించాలన్నారు. అంతేగాకుండా డంపింగ్‌ యార్డులో పచ్చదనం పెంపొందించాలని సంస్థ ప్రతినిధులను కోరారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌ఓ డాక్టర్‌ రవి, శానిటరీ సూపర్‌వైజర్‌ శ్రీనివాస్‌, రాంకీ సంస్థ ప్రతినిధులు, పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

గుంతల రోడ్డు..

జిన్నారం (పటాన్‌చెరు): గుంతలమయంగా మారిన మాదారం రోడ్డును ఆర్‌అండ్‌బీ అధికారులు మంగళవారం పరిశీలించారు. గ్రామ మాజీ సర్పంచ్‌ సురేందర్‌గౌడ్‌తో కలిసి డీఈ రామకృష్ణ పరిశీలించారు. నిత్యం కంకర క్రషర్ల టిప్పర్లు రాకపోకలతో రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. ధ్వంసమైన రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా మారిందని వివరించారు. రోడ్డుపైకి టిప్పర్లు రాకుండా రోడ్డును మూసివేశామన్నారు. దీంతో యాజమాన్యం రోడ్డు మరమ్మతులకు ముందుకు వచ్చారని తెలిపారు. త్వరలోనే రోడ్డు మరమ్మతు పనులు చేపడతామని ఆర్‌అండ్‌బీ అధికారులు స్థానిక నాయకులకు చెప్పారు.

సిమెంట్‌ లారీ బ్రేక్‌ డౌన్‌తో స్తంభించిన ట్రాఫిక్‌



జీహెచ్‌ఎంసీ జోనల్‌ కార్యాలయం యూ టర్న్‌ వద్ద బ్రేక్‌ డౌన్‌ అయిన లారీ



స్తంభించిన వాహనాలు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి జీహెచ్‌ఎంసీ జోనల్‌ కార్యాలయం ఎదురుగా ఉన్న యూ టర్న్‌ వద్ద సిమెంట్‌ లారీ బ్రేక్‌ డౌన్‌తో మంగళవారం ట్రాఫిక్‌ నిలిచిపోయింది. దీంతో భెల్‌ చౌరస్తా నుంచి గచ్చిబౌలి వైపు వచ్చే వాహనాలు లింగంపల్లి, డోయన్స్‌ కాలనీ వరకు, గచ్చిబౌలి నుంచి లింగంపల్లి వైపు వెళ్లే వాహనాలు గంటల తరబడి ట్రాఫిక్‌లోనే చిక్కుకుపోగా విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ పవన్‌కుమార్‌ ఆధ్వర్యంలో పోలీసులు 3 గంటల పాటు శ్రమించి ట్రాఫిక్‌ను క్లియర్‌ చేశారు.

కొనుగోళ్లపై రైతులకు అవగాహన

జిన్నారం (పటాన్‌చెరు): ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి రైతులతో వ్యవసాయ అధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మంగళవారం మండలంలోని కానుకుంట రైతు వేదికలో వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌ మాట్లాడుతూ.. కలెక్టర్‌ వల్లూరి క్రాంతి ఆదేశాల మేరకు సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సన్నవరి ధాన్యం క్వింటాలుకు రూ.500 బోనస్‌ ఇవ్వనున్నట్లు తెలిపారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి తేమ శాతాన్ని 17 శాతం మించకుండా ప్యాడి క్లీనర్‌లో వేసి కేంద్రానికి తీసుకురావాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ఏ గ్రేడ్‌ ధాన్యానికి, సన్నాలకు రూ.2320, సాధారణ రకానికి రూ.2300లతో అదనంగా రూ.500 రైతుల ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో రైతుల రిజిస్టర్‌లో వ్యవసాయ విస్తరణ అధికారి టోకెన్‌ జారీ చేసిన ధాన్యాన్ని మాత్రమే తూకం వేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఐకేపీ, ఏపీఎం శివకుమార్‌, ఏఈఓ ప్రణవి, సీసీ కృష్ణ, బీటీఏలు కల్పన, మహేశ్వరి, కమిటీ సభ్యులు రైతులు వెంకటేష్‌ గౌడ్‌, మల్లారెడ్డి, బాలారెడ్డి, భిక్షపతి, మహేశ్‌, రాజు,రాజిరెడ్డి పాల్గొన్నారు.

ఆదివాసీల వేగుచుక్క కొమురం భీమ్‌

కాంగ్రెస్‌ నేత నీలం మధుముదిరాజ్‌

పటాన్‌చెరు టౌన్‌: నిజాం నవాబుకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు కొమురం భీమ్‌ అని కాంగ్రెస్‌ నేత నీలం మధు ముదిరాజ్‌ అన్నారు. మంగళవారం కొమురం భీం జయంతి సందర్భంగా చిట్కుల్‌లోని క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మధు మాట్లాడుతూ.. ఆదివాసీలపై నిజాం నవాబు సాగించిన దోపిడీ, దౌర్జన్యాలపై వీరోచితంగా పోరాటం చేసిన ధీరుడు కొమురం భీమ్‌ అన్నారు. ఆదివాసీలపై నిజాం సర్కార్‌ పాశవిక చర్యలకు పాల్పడిన సందర్భంలో 'జల్‌, జంగల్‌, జమీన్‌' నినాదంతో భీకరంగా పోరాడి వీర మరణం పొంది ఆదివాసుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచాడని కొనియాడారు. కార్యక్రమంలో నారాయణరెడ్డి, మురళీ, గోపాల్‌, శంకర్‌, రాఘవేంద్ర, రవి, విష్ణువర్ధన్‌, గోపాల్‌ పాల్గొన్నారు.

మూసీ ప్రక్షాళనకు వ్యతిరేకం కాదు

- చేసే పద్ధతికి మాత్రమే వ్యతిరేకం
- మూసీని శుద్ధి చేయాల్సిందే..
- ఎంపీ ఈటల రాజేందర్‌



మూసాపేట: మూసీ ప్రక్షాళనకు మేము వ్యతిరేకం కాదని, చేస్తున్న పద్ధతికి మాత్రమే వ్యతిరేకమని ఎంపీ ఈటల రాజేందర్‌ అన్నారు. ఫతేనగర్‌ డివిజన్‌ పరిధిలోని భరత్‌నగర్‌ పార్కులో మంగళవారం బ్రేక్‌ ఫాస్ట్‌ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఢిల్లీలో ఉన్నప్పుడు తప్ప ఇక్కడ ఉన్న ప్రతి రోజూ నియోజకవర్గంలోనే పర్యటిస్తున్నానని తెలిపారు. అభివృద్ధి పనుల కోసం అధికారులను కలిసినప్పుడు నిధులు లేవని సమాధానం చెబుతున్నారని తెలిపారు. కేంద్రంలో అర్బన్‌ డెవలప్‌మెంట్‌ మంత్రిని కూడా కలిసి స్వచ్ఛభారత్‌, స్మార్ట్‌ సిటీ కింద నిధులు ఇవ్వాలని కోరినట్లు గుర్తు చేశారు. చెరువుల్లోకి మురుగు నీటిని పోకుండా దారి మళ్లించేందుకు గతంలో స్ట్రాటజిక్‌ నాలా డెవలప్‌మెంట్‌ తీసుకువచ్చిందన్నారు. దానికి కొన్ని నిధులు కేటాయించాలని కోరానన్నారు. హైడ్రా ఉద్దేశం వేరే ఉందని నేను చెప్పిన మాటలు ఇప్పటికీ ప్రజలు నమ్ముతున్నారన్నారు. రసాయన వ్యర్థాలను శుద్ధి చేస్తేనే మూసీ బాగుపడుతుందన్నారు. సీనియర్‌ నాయకులు రామ్మోహన్‌ పుట్టిన రోజు సందర్భంగా కేక్‌ కట్‌ చేయించారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌ మహేందర్‌, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు, అసెంబ్లీ కన్వీనర్‌ శ్రీకర్‌రావు, బూరుగుపల్లి రామ్మోహన్‌, కృష్ణ గౌడ్‌, నాగిరెడ్డి, బిక్షపతి, ఐలన్న, విజయ్‌కుమార్‌, కృష్ణయ్య, వేణు, శ్రీనివాసరెడ్డి, మాణిక్‌రెడ్డి పాల్గొన్నారు.

మూసీ బాధితులకు అండగా బీజేపీ

బండ్లగూడ: మూసీ బాధితులకు అండగా ఉంటామని రాజేంద్రనగర్‌ కంటెస్టెడ్‌ ఎమ్మెల్యే అభ్యర్థి, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌ కార్పొరేటర్‌ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కార్పొరేషన్‌ పరిధిలోని హైదర్షాకోట్‌, బైరాగిగూడ, గంధంగూడ తదితర ప్రాంతాల్లో మూసీ బాధితులతో సమావేశమయ్యారు. విష్ణుశ్వర కాలనీ, శివపురి కాలనీ, దత్తాత్రేయ కాలనీ, కిస్మత్‌పూర్‌ ప్రాంతాలకు చెందిన వాసులతో సమీక్షించారు. బాధితులకు అండగా నిలిచేందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఆదిలాబాద్‌ ఎమ్మెల్యే పాయల్‌ శంకర్‌ బుధవారం పర్యటిస్తారన్నారు.


సేవల్లో మేటి.. ఎవరూ లేరు సాటి..

- పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి కేంద్రం అవార్డు
- నాణ్యతా ప్రమాణాల ధ్రువీకరణ
- సేవలు బాగున్నాయని కితాబు
- జిల్లాలోనే ప్రథమ స్థానం
- సంతోషం వ్యక్తం చేస్తున్న వైద్య బృందం

పటాన్‌చెరు టౌన్‌: పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రి జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. వైద్య సేవలు బాగున్నాయని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం అవార్డు ప్రకటించింది. వంద పడకల సామర్థ్యం ఉన్న ఈ ఆస్పత్రి.. సేవల్లో దూసుకుపోయింది. కేంద్రప్రభుత్వం నిర్వహించిన తనిఖీల్లో భాగంగా అవార్డులు దక్కాయి. జాతీయ నాణ్యతా ప్రమాణాల ధ్రువీకరణ సంస్థ లక్ష్య పేరుతో ఈ ఏడాది జనవరి 9 నుంచి 11 మధ్య ఢిల్లీ నుంచి వచ్చిన బృందం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసింది. ఇక్కడ రోగులకు అందుతున్న సేవలపై సంతృప్తి చేసింది.

15 విభాగాల్లో పరిశీలన

ముఖ్యంగా ఆస్పత్రికి వస్తున్న రోగులకు అందుతున్న సత్వర సేవలు, అందుబాటులో ఉన్న సౌకర్యాలకు సంబంధించి 15 విభాగాల్లో ప్రత్యేక బృందం పరిశీలన చేసింది. ఇందులో భాగంగా కన్సల్టెన్సీ, బ్లడ్‌ బ్యాంక్‌, అవుట్‌ పేషెంట్‌, ఇన్‌పేషెంట్‌, మెటర్నిటీ, పీడియాట్రిక్‌, ఆపరేషన్‌ థియేటర్‌, పీపీ యూనిట్‌, ల్యాబ్‌, ఎస్‌ఎన్‌సీయూ, రేడియాలజీ, ఫార్మసీ, మార్చురీ, పారిశుద్ధ్యం, సెక్యూరిటీ, హాస్పిటల్‌ పరిపాలన వంటి అంశాల్లో క్షేత్రస్థాయిలో వైద్యవర్గాలు, రోగుల నుంచి తీసుకున్న ఫీడ్‌ బ్యాక్‌కు అనుగుణంగా జాతీయ నాణ్యతా ప్రమాణాల ధ్రువీకరణ సంస్థకు సంబంధించి 95 మార్కులు, లక్ష్యలో 93.5 మార్కులు సాధించి, జిల్లాలో ప్రథమ స్థానంలో నిల్చింది.



పటాన్‌చెరు ప్రభుత్వ వద్ద ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది

మూడేళ్లకు రూ.30 లక్షలు

వైద్యులు, సిబ్బంది కృషి ఫలించింది. ఆస్పత్రికి నిధుల వరద పారనుంది. ఒక్కో బెడ్‌కు రూ.150 చొప్పున వంద బెడ్లకు ఏడాదికి రూ.10 లక్షల చొప్పున మూడేళ్లకు రూ.30 లక్షలు నిధులు రానున్నాయి. ఈ నిధులతో ఆస్పత్రికి అవసరమైన వసతుల రూపకల్పన చేయవచ్చని వైద్యాధికారులు చెబుతున్నారు. తమ ఆస్పత్రికి అవార్డు దక్కడంతో వైద్య సిబ్బంది సంబరపడి పోతున్నారు. ఇది సమష్టి కృషి అని, ఈ అవార్డు తమపై మరింత బాధ్యత పెరిగిందని వారు చెబుతున్నారు. ఇక ముందు కూడా రెట్టింపు ఉత్సాహంతో సేవలందిస్తామని పేర్కొన్నారు.

సమష్టి కృషి ఫలితమే



వైద్యవర్గాల సమష్టి కృషి ఫలితంగా ఈ అవార్డు దక్కింది. వైద్యానికి ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో పాటు వైద్యవర్గాలు ఎంతో కష్టపడి పని చేశాం. ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఏ సౌకర్యం కావాలన్నా వెంటనే స్పందిస్తున్నారు.

– డాక్టర్‌ శ్రీనివాస్‌ రెడ్డి, సూపరింటెండెంట్‌

కుమ్మరులకు అండగా ఉంటా

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని కుమ్మరులకు అండగా ఉంటానని మణికొండ మున్సిపాలిటీ చైర్మన్‌ కే నరేందర్‌ముదిరాజ్‌ అన్నారు. మున్సిపాలిటీ శాలివాహన కుమ్మర సంఘం వారు మంగళవారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలను కుమ్మరులకు అందేలా చూసానని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కే లక్ష్మీనారాయణ, డీ పురుషోత్తం, నాయకులు పాల్గొన్నారు.